ప్రజాశక్తి
బుధవారం 11 సెప్టెంబర్ 2024 | 5 | అనంతపురం





పాస్‌ల కోసం ఆర్డీటీ స్టేడియం బయటకు వేచి ఉన్న క్రికెట్ అభిమానులు

అందరి చూపు.. ఆస్థలం వైపు..!

హిందూపురం నియోజక వర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నియోజక వర్గం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బావమ్మర్ది నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాలు సాధించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ సారి బాలయ్య ఇలాఖాలో అధికార పార్టీకి చెందిన కొంత మంది అధికారాన్ని అడ్డు పెట్టుకుని కబ్జాల పర్వాన్ని ప్రారంభించారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

◆ రాత్రికి రాత్రే పాల రైతుల కో ఆపరేటివ్ సొసైటీ భవనం కూల్చివేత

◆ బాలయ్య ఇలాఖాలో కబ్జాల యత్నం..?





కూల్చివేయడంతో భవనం శిథిలాలు



భవనంలో ఉన్న అప్పటి రికార్డులు



తమకు స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారికి వినతిని ఇస్తున్న వీర శైవ సంఘం నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మెయిన్ బజారులో సుమారు రూ.2 కోట్ల విలువజేసే పాల రైతుల కో ఆపరేటివ్ మిల్క్ సప్లయ్ యూనియన్ లిమిటెడ్‌కు చెందిన భవనాన్ని మూడు రోజుల క్రితం రాత్రికిరాత్రే కూల్చివేశారు. దీని వెనుక అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతల హస్తం ఉందనే ప్రచారం జోరుగా విన్పిస్తోంది. ప్రస్తుతం భవనం కూల్చి వేయడంతో అక్కడ ఖాళీ స్థలం కన్పిస్తోంది. దీంతో అందరి చూపు ఆ ఖాళీ స్థలంపైనే పడింది. ఆ స్థలాన్ని ఆలయ అభివృద్ధికి కేటాయించాలని వీర శైవ సంఘం వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. తమ స్థలంలో ఉన్న భవనాన్ని కూల్చి, అందులో ఉన్న పాల కూలింగ్ మిషన్, సేఫ్టీ లాకర్, అల్యూమినియం పాల క్యాన్లు ఎత్తుకొని పోయారంటూ పాల రైతులు పోలీసు స్టేషన్, రెవెన్యూ, ఎమ్మెల్యే కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఇక అధికార పార్టీ నేతలు స్థలాన్ని కబ్జా చేసేందుకు వారి ప్రయత్నాల్లో వారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఎవరికి వారు ఈ స్థలాన్ని వారి గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తుండడంతో హిందూపురం పట్టణంలో ఈ స్థలం అంశం హాట్ టాపిక్‌గా మారింది.

హిందూపురం పట్టణ సమీపంలో ఉన్న సుగూరు, సడ్లపల్లి, పోచనపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పాడి ఉత్పత్తి చేసిన పాలను పట్టణానికి తీసుకొచ్చి విక్రయించే వారు. పాడి రైతులందరూ కలిసి హిందూపూర్ కో ఆపరేటివ్ మిల్క్ సప్లయ్ యూనియన్ లిమిటెడ్‌గా ఏర్పడి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పాటు యూనియన్‌లో ఉన్న రైతులు అందరూ చేరి ఆ సమయంలో మెయిన్ బజారులో ఓ ప్రయివేటు వ్యక్తి నుంచి స్థలాన్ని కొనుగోలు చేసుకుని, భవన నిర్మాణం చేసకున్నారు. తర్వాత అక్కడి నుంచి హిందూపురం పట్టణ వ్యాప్తంగా పాలను అందిస్తుండేవారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో రైతులు పాలను గ్రామాల్లో ప్రవేటు డెయిరీకే విక్రయించడం మొదలైంది. దీంతో రైతులు ఏర్పాటు చేసుకున్న కో ఆపరేటివ్ యూనియన్ భవనంలో క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. ఆ భవనం సంవత్సరాలుగా మూతపడింది. పాల క్యాన్లతో పాటు యూనియన్‌కు సంబంధించిన రికార్డులు అన్నీ ఆ భవనంలోనే ఉన్నాయి.

బాలయ్య ఇలాఖాలో కబ్జాలు..?

బాలయ్య ఇలాఖాలో గతంలో ఎప్పుడూ లేని విధంగా పురంలో కబ్జాల పర్వం ప్రారంభం అయిందనే వాదన ఇటీవల విన్పిస్తోంది. పాల భవనం కూల్చివేత విషయం బాలయ్య దృష్టికి వెళ్లిందా....? ఆయనకు తెలియకుండా స్థానిక అధికార పార్టీ నాయకులు కబ్జాకు యత్నిస్తున్నారా...? అన్న విషయాలపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. ఈ భవనం కూల్చివేత, కబ్జా యత్నంపై ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించి వాస్తవాలు బహిర్గతం అయ్యేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అధికార పార్టీ నేత పనేనా..?

175 మంది పాల రైతులతో ఏర్పడిన హిందూపూర్ కో ఆపరేటివ్ మిల్క్ సప్లయ్ యూనియన్ లిమిటెడ్ భవనంపై అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య వ్యక్తి కన్ను పడినట్లు తెలుస్తోంది. దీంతో పాటు మున్సిపల్ ఖాళీ స్థలాలపై సైతం అధికార పార్టీ నాయకులు కన్నేశారు. ముందుగా పాల రైతుల కోపరేటివ్ యూనియన్ భవనానికి సంబంధించిన రైతులందరూ గ్రామాల్లో ఉన్నారని, ప్రస్తుతం పాలక వర్గం సైతం లేక పోవడం తదితర అంశాలతో పాటు ఈ భవనంకు దిక్కు ఎవరూ లేరని గుర్తించి కొంతమంది అధికార పార్టీ నాయకుల కన్ను ఆ భవనంపై పడింది. వారికి వినాయక పండుగ కలిసి వచ్చింది. పండుగ సమయంలో ఎవరూ పట్టించు కోరని భవనాన్ని రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా కూల్చివేశారు. ఆ తర్వాత స్థలాన్ని కబ్జా చేసేలా ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. మున్సిపాల్టీలో ఏదైనా భవనం కూల్చాలంటే పాలక వర్గం, అధికారుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాల్సి ఉంది. పాల భవనం కూల్చివేతలో ఎలాంటి అనుమతులూ తీసుకోలేదు. ప్రస్తుతం ఈ భవనాన్ని ఎవరు కూల్చారన్న దానిపై పట్టణంలో పెద్ద చర్చ నడుస్తోంది. దీని వెనుక అధికార పార్టీ నేత హస్తం ఉందనే వాదన మాత్రం బలంగా ఉంది. కోట్లు విలువ చేసే భూమిని దక్కించుకోవడానికి సదరు నేత అన్ని మార్గాలను అన్వేషించి ఈ కూల్చివేతకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.

పాసుల కోసం పడిగాపులు..!

◆ రెండవ మ్యాచ్‌లోనైనా సరిచేసేరా..?
◆ రేపటి నుంచి దులీప్‌ట్రోఫీ రెండు మ్యాచ్‌లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

క్రికెట్ జాతీయ స్థాయి అగ్రశ్రేణి టోర్నమెంట్‌లో దులీప్ ట్రోఫీ ఒకటి. ఇంతటి గొప్ప టోర్నమెంటు తొలిసారిగా అనంతపురం జిల్లాలో జరుగుతోంది. అగ్రశ్రేణి ఆటగాళ్లు అందరూ ఇక్కడికి విచ్చేశారు. ఈనెల 5న టోర్నీ నుంచి ప్రారంభమైంది. ఇప్పటికే ఒక మ్యాచ్ పూర్తయ్యింది. రెండో మ్యాచ్ ఈనెల 12వ తేది నుంచి ప్రారంభం కానుంది. టోర్నీలో ఇక నుంచి రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో ఒక మ్యాచ్‌కు మాత్రమే ప్రేక్షకులకు అనుమతి ఉంది. రెండోగ్రౌండ్‌లో స్టాండ్స్‌లేవు. దీంతో ప్రేక్షకులకు అనుమతి లేదు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ ప్రధాన మైదానంలోనే స్టాండ్స్ ఉన్నాయి. ఇక్కడ నాలుగు వేల మంది వరకు కూర్చోని చూడటానికి అవకాశముందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇందుకు తగ్గట్టుగానే పాసులు ఉచితంగా ఇస్తున్నట్టు చెబుతున్నారు.

ఆటగాళ్ల ముమ్మర సాధన..!

దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ కోసం ఇండియా ఏ, బీ, సీ, డీ జట్టు సభ్యులు జోరుగా సాధన కొనసాగించారు. మంగళవారం స్థానిక ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో ఇండియా ఏ జట్టుకు చెందిన మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ఎస్.కె.రషీద్, తిలక్ వర్మ, శివందుబే, ఇండియా బి జట్టుకు నుంచి అభిమన్యు, ఈశ్వరన్, రింకూ సింగ్, నవదీప్ సైనీ, వాషింగ్టన్ సుందర్, ముఖేష్‌తో పాటు ఇండియా సీ, డీ జట్టు ఆటగాళ్లు సాధన చేశారు. మైదానంలో కసరత్తు చేసిన తర్వాత.. నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ చేశారు.



ఆర్డీటీ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న ఆటగాళ్లు

వీక్షకులు తక్కువ... పాసుల కోసం ఎదురుచూసేవారెక్కువ..!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎక్కువగా ఉన్నారు. అగ్రశ్రేణి ఆటగాళ్లు అందరూ వచ్చినందున నేరుగా మ్యాచ్ చూడొచ్చునని ఆశపడ్డారు. దీంతోపాటు ఉచితంగా పాసులిస్తుండడంతో యువత ఎక్కువగా ఉత్సహం చూపారు. మొదటి మ్యాచ్ ప్రారంభానికి రెండు రోజుల ముందు పంపిణీ చేస్తున్నట్టు డీఎస్పీ శివారెడ్డి చేత ప్రారంభించారు. కొన్ని పంపిణీ చేసి తరువాత నిలిపివేశారు. ఇక ముఖ్యమైన వారికి నేరుగా పాసులు అందజేశారు. ఈ పాసులు ఎవరెవరికి పంపిణీ చేసారో తెలియని పరిస్థితి ఉందని జిల్లా క్రికెట్ సంఘం నేతలు చెబుతుండటం గమనార్హం. తమకు కూడా ఐదుకు మించి పాసులివ్వలేదని, ఎవరి వద్దనున్నాయో తెలియదని అంటున్నారు. 12వ తేదీ జరిగే మ్యాచ్‌లకు కూడా పాసులు పంపిణీ చేస్తారని ప్రచారం జరుగడంతో మంగళవారం ఉదయం పెద్దఎత్తున అభిమానులు స్టేడియం వద్దకు చేరుకున్నారు. ఎంతసేపు వేచి ఉన్నా ఇస్తారో లేదో చెప్పేవారు లేక నిరాశతో అభిమానులు వెనుదిరిగారు. ఓ వైపు పాసులన్నీ ఇచ్చేశామని నిర్వాహకులు చెబుతున్నా మైదానంలో మాత్రం వీక్షకులు తక్కువగానే కన్పిస్తున్నారు. మరి వారు ఇచ్చామని చెబుతున్న పాసులు ఎక్కిడికి వెళ్లాయన్నదే ఇప్పుడు క్రికెట్ అభిమానుల మదిలో మెదులుతున్న ప్రశ్న.

తరువాతి మ్యాచ్‌లకైనా లోటుపాట్లు సరిచేసేరా..?

టోర్నీలో భాగంగా పలు ఇబ్బందులు మొదటి మ్యాచ్‌లో చోటు చేసుకున్నాయి. వీటి నుంచి గుణపాఠం నేర్చుకుని తరువాత జరిగే రెండు మ్యాచ్‌లకైనా సరిచేస్తారా లేదా అన్న దానిపై చర్చ నడుస్తోంది. మొదటి మ్యాచ్‌లో పాస్‌ల జారీ, వివిఐపిలకు కేటాయింపు, భోజనాల విషయంలో విమర్శలొచ్చాయి. తినుబండారుల విషయంలోనూ ధరలు అధకింగానున్నాయన్న ఆరోపణలున్నాయి. రాబోయే మ్యాచ్‌ల సమయానికైనా వీటిని సరిచేసే ప్రయత్నం నిర్వాహకులు చేస్తారన్నది చూడాల్సి ఉంది.



టవర్ క్లాక్ వద్ద రాస్తారోకో చేస్తున్న కార్మిక, రైతు, విద్యార్థి సంఘం నాయకులు

విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేయొద్దు

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటు సంస్థలకు అప్పగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకుని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే పరిశ్రమను కొనసాగించాలే చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోరుతూ మంగళవారం నాడు అనంతపురంలో కార్మిక, రైతు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో టవర్ క్లాక్ సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించి నిరసన తెలియజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.వెంకట నారాయణ, జిల్లా కమిటీ నాయకులు వి.రామిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేష్ గౌడ్, రాజారెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. ఆంధ్రుల హక్కుగా విశాఖ ఉక్కు పరిశ్రమ స్థాపితం అయ్యిందన్నారు. దీనిని ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తేనే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రయివేటీకరణ చేస్తే యాజమాన్యాలు లాభాపేక్షతో పరిశ్రమ నిర్వహిస్తారని తెలిపారు. ఇదే జరిగితే ప్రజలు, కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలన్నారు. పరిశ్రమలకు ఖనిజ ముడి సరుకు సరఫరా చేసి లాభాల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు శ్రీనివాసులు, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, గ్రానైట్ టైల్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎర్రిస్వామి రెడ్డి, కార్యదర్శి వీరయ్య, నాగేంద్ర, హరి, ఎఐటియుసి కృష్ణుడు, రైతు సంఘం నాయకులు మల్లికార్జున, చెన్నప్ప, యాదవ్ పాల్గొన్నారు.

తాడిపత్రిలో భారీ అగ్ని ప్రమాదం

◆ లలిత మెగా మాల్‌లో మంటలు ◆ రూ.2 కోట్లకు పైగా నష్టం

ప్రజాశక్తి-తాడిపత్రి



లలితా మెగా మాల్‌లో ఎగిసిపడుతున్న మంటలు

తాడిపత్రి పట్టణం నడిబొడ్డులోని లలిత మెగా మాల్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వినాయకుని మండపాల వద్ద యువత, ప్రజలు ఉత్సాహంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా షాపింగ్ మాల్‌లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. మంటలు వ్యాపించగానే స్థానికులు నిర్వాహకులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. హుటాహుటిన రెండు ఫైర్ ఇంజన్లు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. మంగళవారం ఉదయం 9 గంటల వరకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద స్థలాన్ని డీఎస్పీ జనార్దన్ నాయుడు, జిల్లా ఫైర్ ఆఫీసర్‌తో పాటు పలువురు అధికారులు పరిశీలించారు. ప్రమాదంలో దాదాపు రూ.రెండు కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇటీవల తాడిపత్రిలో రాజకీయ ఘర్షణలు జరిగిన నేపథ్యంలో ఉన్న ఫలంగా అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో భయాందోళన పరిస్థితి నెలకొంది. కొంతసేపటి తర్వాత షార్ట్ సర్క్యూట్‌తో లలితా మెగామాల్‌లో అగ్ని ప్రమాదం జరిగిందనే విషయం తెలియడంతో పట్టణవాసులు ఊపిరి పీల్చుకున్నారు. తాడిపత్రి పట్టణంలో గత పది సంవత్సరాలుగా లలితా మెగామాల్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో 30 మందికి పైగా ఉపాధిని కల్పిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించే సంస్థగా గుర్తింపు పొందింది. ఇలాంటి మాల్‌లో ప్రమాదం చోటు చేసుకుని పూర్తిగా తగలబడిపోవడంతో స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పామిడి

శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ పి.జగదీష్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలపై ఆరాతీశారు. తర్వాత పెండింగ్ కేసుల రికార్డులను తనిఖీ చేసి కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్‌లు నిర్వహిస్తూ ఎన్‌ఫోర్మ్‌మెంట్ కేసులు నమోదు చేయడంతోపాటు రోడ్డు భద్రత నియమాలపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను కట్టడి చేయాలన్నారు. రౌడీషీటర్లు, చెడునడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. తర్వాత పోలీస్ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రాజీపడదగ్గ కేసులకు సంబంధించి ఇరువర్గాలను పిలిపించి స్వచ్ఛందంగా రాజీ పడేలా చేసి తద్వారా కేసులు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో పామిడి సి.ఐ యుగంధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె : అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ జగదీష్ పోలీసులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు నష్టం వాటిల్లకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డు పరిశీలించి పోలీసుల నివాస గృహాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మునీంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భిక్షమెత్తి బతకాలా..!

భిక్షాటన చేస్తూ 'సత్యసాయి', 'శ్రీరామిరెడ్డి' కార్మికుల నిరసన



కళ్యాణదుర్గంలో భిక్షాటన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

'ఆరునెలలుగా వేతనాలు చెల్లించకుంటే భిక్షమెత్తుకుని బతకాలా..' అంటూ శ్రీరామిరెడ్డి, శ్రీ సత్యసాయి తాగునీటి పథకాల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 6వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల్లో వందలాది మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారందరికీ దాదాపు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే ఎలా కుటుంబాలను పోషించుకోవాలని నిలదీశారు. కార్మికులు ఆందోళనలు, సమ్మెలు చేస్తే తప్ప జీతాలు చెల్లించే పరిస్థితిలో ప్రభుత్వం లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకులు మారకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అయినా వేతనాలు చెల్లిస్తుందని ఆశించిన కార్మికులకు నిరాశే ఎదురైందన్నారు. ఈనేపథ్యంలో విధిలేని పరిస్థితుల్లో కార్మికులు సమ్మెలోకి రావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి, సత్యసాయి కార్మికులు తిప్పేస్వామి, నరేష్, నాగప్ప, రామాంజి, పరందామ, భవిత్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 6వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి పంపుహౌస్ వద్ద దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. పిల్లల చదువులు, ఆసుపత్రి ఖర్చులు, కుటుంబ ఖర్చులకు డబ్బులు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు తమపై దయ ఉంచి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంథోనిరెడ్డి, రమేష్‌రెడ్డి, చిన్న, శంకర్, శ్రీధర్, హరి, శివ, చిన్నకేశవులు, వెంకటేష్‌నాయక్, దివాకర్, శ్రీరాములు, సాయిప్రసాద్‌రెడ్డి, ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.


నార్పల : పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ శ్రీ సత్యసాయి నీటి సరఫరా పథకం కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని బి.పప్పూరు పంపుహౌస్ వద్ద చేపట్టిన దీక్షలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, చంద్రమోహన్, నరసింహులు, ధనుంజయ, ఈశ్వరయ్య, శివశంకర్, అంకన్న, శరత్‌బాబు, నాగరాజు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

వేధించి.. ఆపై హత్య చేసి..

విద్యార్థిని హత్య కేసు ఛేదింపు- నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండలం వడ్డుపల్లి కెనాల్ వద్ద జరిగిన సరిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆత్మకూరు సీఐ హేమంత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుమ్మఘట్ట మండలం వెంకటాంపల్లికి చెందిన తిప్పేస్వామి, సరిత పక్కపక్క గ్రామాలకు చెందిన ఒకే సామాజిక వర్గం వారు. అయితే గత కొన్నేళ్లుగా తనను ప్రేమించమని తిప్పేస్వామి సరితను వేధించేవాడు. అంతేగాకుండా తనకు సరితనిచ్చి పెళ్లి చేయాలని సరిత తండ్రిని అడిగాడు. అయితే తన కూతురుని ఉన్నత చదువులు చదివిస్తానని చెప్పాడు. దీంతో తిప్పేస్వామి వేరే యువతిని వివాహం చేసుకున్నాడు. అయినా సరితను వేధింపులకు గురి చేస్తూనే ఉండేవాడు. అనంతపురంలో సరిత ఉంటున్న హాస్టల్ వద్దకు వచ్చి ఇబ్బందులకు గురి చేసేవాడు. ఫోన్ చేసి బెదిరించేవాడు. అయితే తండ్రికి చెబితే ఎక్కడ చదవు మాన్పిస్తారో.. అని భయపడిన సరిత వేధింపులను భరిస్తూ వచ్చింది. ఈనేపథ్యంలో ఈనెల 7న వినాయక చవితి రోజు తనతో మాట్లాడాలని బెదిరించి వడ్డుపల్లి వద్ద ఉన్న కెనాల్ వద్దకు తీసుకెళ్లాడు. సరిత తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడుతుండగా పక్కా ప్రణాళికతో ముందుగానే పల్సర్ బైక్‌లో తెచ్చుకున్న మచ్చుకత్తితో నరికి పరారయ్యాడు. కేసును సీరియస్‌గా తీసుకుని ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో రూరల్ డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి పర్యవేక్షణలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడు గోనబావి తిప్పేస్వామి అలియాస్ పండూను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందర్ బాబునాయక్, సవరప్ప, కానిస్టేబుల్ ఇ.నల్లప్పీ, అనిల్‌కుమార్, ఏకాంత, అతిక్, పెద్దన్న, సురేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ హేమంత్‌కుమార్

2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ



సచివాలయ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి రైతుసంఘం, సిపిఎం నాయకులు

2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించడంతోపాటు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేల పెట్టుబడి సాయాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరూపాక్షి డిమాండ్ చేశారు. మంగళవారం వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల, గూళపాల్లెం, వజ్రకరూరు సచివాలయాల్లో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే అన్నదాత సుఖీభవ మొత్తాన్ని రైతుల ఖాతాలకు జమ చేయాలన్నారు. జిల్లాలో 2023 ఖరీఫ్, రబీ సీజన్లలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సకాలంలో వర్షాలు రాక అతివృష్టి, అనావృష్టి వల్ల సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ముఖ్యంగా మిరప పంటకు చివరలో నీరు అందక చాలా నష్టపోయారన్నారు. దీంతో పెట్టుబడులు రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా కట్టాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో అన్నదాతలు ఉన్నారన్నారు. 2023 ఖరీఫ్‌లో 28, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా నివారణ చర్యలు మాత్రం చేపట్టలేదన్నారు. కావున రైతులను ఆదుకోవడానికి 2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించి రైతుల ఖాతాలకు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సుధాకర్, సత్యప్రకాష్, షేక్షావలి, బాషా, తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా నగరపాలక సంస్థలోని ఉన్నతాధికారులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం.నాగరాజు, కె.నాగభూషణ మాట్లాడుతూ విజయవాడలోని వరద ముంపునకు గురై అనేకమంది మృతిచెందడంతోపాటు ఆస్తి నష్టం సంభవించిందన్నారు. సర్వం కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఇందులోనే ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం సంజీవరాయుడు, పోతలయ్య, పారిశుధ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నగర కోశాధికారి లక్ష్మీనరసమ్మ, కమిటీ సభ్యులు నాగేంద్ర, కుమార్, కుళ్లాయప్ప, శ్రీనివాసమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ గోనుగుంట్ల సావిత్రి

ప్రజాశక్తి-అనంతపురం

పుస్తకావిష్కరణలో రచయిత్రి నల్లాని రాజేశ్వరి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సమాజమే తన కుటుంబంగా భావించి నిస్వార్థ సేవలందించిన ఆదర్శ మహిళ గోనుగుంట్ల సావిత్రి రామానాయుడు అని ప్రముఖ రచయిత్రి నల్లాని రాజేశ్వరి కొనియాడారు. మంగళవారం ఐశ్వర్య ఆసుపత్రిలో 'చైతన్యమూర్తి-గోనుగుంట్ల సావిత్రి రామానాయుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లా కోమటికుంట్లకు చెందిన రామలక్ష్మ, ఆదుసుమిల్లి నరసింహుడు దంపతుల కుమార్తె సావిత్రి, ఇడిలేల్లలోని ఆర్.కొట్టాలపల్లికి చెందిన మోతుబరి రైతు గోనుగుంట్ల రామానాయుడును వివాహం చేసుకున్నారని వివరించారు. అయితే రెండు దశాబ్దాల క్రితమే బళ్లారికి వచ్చి స్థిరపడ్డారన్నారు. గృహిణిగా ఉంటూనే తెలుగులో రచనలు, ఉపన్యాసాలతో పలువురి జీవితాలను ప్రభావితం చేశారన్నారు. విద్య, పర్యావరణం, దేశభక్తి, ఆధ్యాత్మిక విషయాలపై చైతన్యం కలిగించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల రామానాయుడు, విద్యావేత్త గొర్తి వెంకటస్వామి, కవి గుత్తా హరిసర్వోత్తమనాయుడు, సావిత్రి బిడ్డలు, అల్లుళ్లు లలిత రమేష్‌నాయుడు, వసంత రంగనాథ్ చౌదరి, లక్ష్మీ మనవళ్లు హర్షిత్, దివ్య, శ్రీష, అనీషా, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు పొబ్బర్లపల్లి ఉపాధ్యాయుడు ఎంపిక

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం



కంబాల తిమ్మారెడ్డి

మండల పరిధిలోని పొబ్బర్లపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కంబాల తిమ్మారెడ్డి మదర్‌థెరిస్సా జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి ఓబుపతి తెలిపారు. ఈమేరకు మంగళవారం పొబ్బర్లపల్లి గ్రామంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ సంస్థ తనకు మదర్‌థెరిస్సా జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు ప్రశంసాపత్రాన్ని పంపినట్లు తెలిపారు. తిమ్మారెడ్డి పొబ్బర్లపల్లి 15 ఏళ్ల క్రితమే కళ్యాణదుర్గంలోని రఘువీరా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. దీంతోపాటు 8ఏళ్ల క్రితం దుర్గం రక్తదాతల సంస్థను ప్రారంభించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కంబాల తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు తనలో మరింతగా బాధ్యతను పెంచిందన్నారు. రాబోయే రోజుల్లో మీ అందరి సహాయ, సహకారాలు, సలహాలు, సూచనలతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

జెడ్.వీరారెడ్డి కాలనీ సమస్యలను పరిష్కరించాలి

గుత్తి : జడ్.వీరారెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జడ్.వీరారెడ్డి కాలనీ పట్టణ శివారులో ఉండడంతో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కాలనీకు ప్రధాన రహదారి లేదన్నారు. వర్షాకాలంలో నీటి వల్ల రాకపోకలు స్తంభించిపోతాయన్నారు. కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నారన్నారు. కొన్నిచోట్ల సీసీ రహదారులను అధికారులు నిర్మించారన్నారని మురికి కాలువలు ఏర్పాటు చేయలేదన్నారు. వీధి దీపాలు అరకొరగా ఏర్పాటు చేశారన్నారు. చిన్నారులు, బాల,బాలికలు అధికంగా ఉన్నారని ప్రాథమిక పాఠశాల,అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, ఆర్ఎన్.కవిత, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను జాప్యం చేయొద్దు : డిఎంహెచ్ఒ

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్లలో నిర్మాణంలో ఉన్న పిహెచ్‌సి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇబి.దేవి సూచించారు. మంగళవారం రాకెట్లలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య భవనాన్ని స్థానిక వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా కొన్ని నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా కాంపౌండ్ నిర్మాణం పెండింగ్‌లో ఉందన్నారు. వాటిని పూర్తి చేసి తమ శాఖకు అప్పగిస్తే స్వాధీనం చేసుకోడానికి తాము సిద్ధమన్నారు. వారం రోజుల్లో మారోసారి వచ్చి పనులు పరిశీలిస్తామని, అప్పటి లోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఎంఒ త్యాగరాజు, వైద్యాధికారులు పావని, వెంకటేష్‌నాయక్ మనోజ్ఞ, వేమరెడ్డి, సిబ్బంది నాగరంగయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

రాయదుర్గం : రాయదుర్గంలోని బాలగంగాధర్ తిలక్, మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ వ్యాధిపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, ఖాసీంపీరా, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజర్ నీలకంఠ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం



పెద్దపప్పూరు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

వైద్యుల పీజీ సీట్లలో కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ పరిధిలోని 8 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే వైద్యులు విధుల్లో ఉంటూనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి ఇది వరకూ 30శాతం సీట్లు కేటాయించేవారన్నారు. అయితే ప్రస్తుతం ఆ కోటాను 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో పీజీ సీట్లు సగానికి తగ్గుతాయని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి పీజీ సీట్లలో కోటాను తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుమ్మఘట్ట : జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంబిబిఎస్ డాక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం రూరల్ పరిధిలో 30 శాతం ఎంబిబిఎస్ డాక్టర్లకు కోటా ఉండగా దాన్ని 15 శాతానికి తగ్గించడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం సంబంధిత జీవోను రద్దు చేసి 30 శాతం కోటాను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బాలాజీనాయక్, సందేశ్, రామ్‌కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : మండలంలోని గ్రామీణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో పని చేస్తే వైద్యులు పోస్టు గ్రాడ్యుయేషన్ చేసే కోటా తగ్గించడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనూషాదేవి, చాంద్‌బేగం, నారాయణస్వామి, సోమేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు..

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బి.తేజస్విని ఆధ్వర్యంలో వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీ కోటాలో రిజర్వేషన్ తగ్గించడాన్ని నిరసిస్తూ 11, 12వతేదీల్లో వైద్య సేవలకు అంతరాయం లేకుండా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన, 13న అత్యవసర సేవలు మాత్రమే కొనసాగిస్తామని, 15న చలో విజయవాడ, 16న నిరవధిక నిరాహార దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వీరికి వైద్య సిబ్బంది మద్దతు తెలిపారు.

జెవివి మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

జిల్లా కేంద్రంలో ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు మల్లికార్జున పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను జెవివి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలను తొలగించడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే దిశగా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా సైన్స్ విస్తరించే దిశగా చేపడుతున్న జెవివి మహాసభలను విజయవంతం చేసేందుకు అన్నివర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు భాస్కర్, జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లికార్జున, జోనల్ అధ్యక్షులు కంబాల తిమ్మారెడ్డి, లింగప్రసాద్, కిషోర్, నాగరాజు, అజంతుల్లా, కరూర్ పాతరెడ్డి, అశోక్‌కుమార్, భగవాన్‌దాస్, సోమశేఖర్, రోజ్‌లి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన మాంసాన్నే విక్రయించాలి

పామిడి : జంతువధ మార్కెట్లలో ఆరోగ్యకరమైన మాంసాన్నే విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గజరాంపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక పశు వైద్యశాలలో డాక్టర్ ఉషాకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామిడి గ్రామపంచాయతీలోని ఆయా జంతువధ శాలలు, మార్కెట్లలో ఆరోగ్యకరమైన పొట్టేళ్లు, గొర్రెలు, మేకలు, ఎద్దులు, దున్నలను వధించడకపోవడంతో అవి తిన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. కావున జంతువులను వధించే ముందు తప్పనిసరిగా డాక్టర్ అనుమతి తీసుకునే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా మాంసం ధరలను కూడా విపరీతంగా పెంచేశారన్నారు. వీటిపై పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాబు, వెంకటేశు, ముత్యాలు, సూరి, నాగరాజు, సాసావలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ మనిషి జీవితంలో సమస్యలు ఉంటాయన్నారు. అయితే మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదన్నారు. ఆత్మహత్యల్లో ఎక్కువ శాతం యువత ఉండటం విచారకరమన్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయమని మంచిది కాదన్నారు. కష్టాలు, సమస్యలను ధైర్యంగా స్వీకరించి అధిగమించేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీనారాయణ, బాబు దేవదాసు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పివికెకెకు పదేళ్లపాటు 'అటానమస్ స్టేటస్'

అనంతపురం : పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి పదేళ్లపాటు అటానమస్ స్టేటస్ లభించినట్లు కళాశాల ఛైర్మన్ పల్లె కిశోర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పివికెకె ఇప్పటికే ఎన్‌బిఎ, ఎన్ఎఎసి గుర్తింపు పొందిందన్నారు. ప్రస్తుతం పదేళ్లపాటు అటానమస్ స్టేటస్ పొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ గొప్ప విజయాలకు సిబ్బంది కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ అధ్యయనంలో నైపుణ్యాల పెంపు, పరిశోధన రంగంలో భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాబోయే సంవత్సరాల్లో పీవీకేకే ఐటీ మరింత గొప్ప మరింత విద్యాసంస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ పల్లె రఘునాథరెడ్డి, కోశాధికారి పల్లె సింధూర, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, ఎఒ మనోహర్‌రెడ్డి, డిప్లొమా ప్రిన్సిపాల్ వైభవ్, శ్రీబాలాజీ పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మథేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పల్లె కిశోర్

రేషన్ అక్రమ నిల్వలపై తనిఖీలు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో రేషన్ అక్రమ నిల్వలపై తనిఖీలు నిర్వహించారు. నగరంలోని గుర్రం వీధి-1 ఎస్టీ క్రాస్, భవానీనగర్ పక్కన, ఎన్‌టిఆర్ మార్గ్ రోడ్డు, నిఖిల్ సాయి టైల్స్, గ్రానైట్ శానిటరీ సేల్స్ షాప్ వెనుక ఉన్న ఖాళీ ప్లాట్‌లో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అక్రమంగా నిల్వ ఉంచి 37.40 క్వింటాళ్ల (74 బ్యాగులు) బియ్యంతోపాటు ఒక స్టిచ్చింగ్ మిషన్, ఒక ఎండియు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే బియ్యం యజమాని సత్రశాల తరుణ్ తేజ, ఎండియు ఆపరేటర్ బి.కష్ణమూర్తి, సహాయకురాలు సల్మాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎస్.జమాల్‌బాషా, ఎఇఇ ఎల్.రవీంద్రనాథ్‌బీ, డిసిటిఒ విజయలక్ష్మి, సిబ్బంది ఆలియ అంజుం, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

శింగనమల : ప్రభుతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మేపల్లి సర్పంచి దేగల లలితమ్మ, టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గుమ్మేపల్లి, కల్లుమడి పంచాయతీల రైతులకు కల్లుమడి సచివాలయం వద్ద సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత వరకూ సాగు చేయని రైతులు విత్తనాలను తీసుకుని సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నల్లప్ప, పంచాయతీ అధికారి మహమ్మద్ రఫీ, నాగరాజు, నవీన్, టిడిపి నాయకులు దేగల శివయ్య, రమేష్, ఓబులేసు, శేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ఈక్రాప్, ఇకెవైసిని వేగవంతంగా పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ : జిల్లావ్యాప్తంగా ఈక్రాప్‌తోపాటు రైతుల ఇకెవైసిలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు రైతు సేవాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 19 వేల ఎకరాల సంబంధించి మాత్రమే ఈక్రాప్ నమోదు చేశారని, ఈనెల 15వ తేదీలోపు వందశాతం ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. అలాగే రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, ఎంపిఇఒలు మెర్సీ, ముత్యాలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఊరేగింపులో మతసామరస్యం

నార్పల : మండల కేంద్రంలోని మంగళవారం సాయంత్రం నిర్వహించిన వినాయక నిమజ్జనంలో మతసామరస్యం వెల్లివిరిసింది. స్థానిక పాత పోలీస్‌స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని సాయంత్రం భారీ కోలాహలం, మేళతాళాలు, డిజె శబ్దాలతో యువకులు ఉత్సాహంగా ఊరేగింపుగా బయలుదేరారు. ఊరేగింపు జామియా మసీదు వద్దకు రాగానే ముస్లిములు సాయంత్రం మగ్రిబ్ (నమాజ్) ప్రార్థన చేసుకోవడానికి సమయం కావడంతో పక్కనే ఉన్న మసీదు నుంచి ఆజా శబ్దం వచ్చింది. దీంతో ఒక్కసారిగా వినాయక విగ్రహం ముందర ఉన్న మేళతాళాలు, డీజే శబ్దాలను ఆపి నిశబ్దం వహించారు. నమాజ్ అనంతరం ముస్లిం యువకులు సైతం నిమజ్జన ఊరేగింపులో కలిసి వెళ్లారు. హిందూ, ముస్లిం సోదరుల ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవం చూపడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

పుట్లూరు : మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చెన్నకేశవులు, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది' వాయిదా

యల్లనూరు : ప్రభుత్వం నూతనంగా నిర్వహించనున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ప్రభుత్వ, అధికార యంత్రాంగాలు వరద బాధితులకు అండగా ఉండటంలో నిమగ్నమైన నేపథ్యంలో ఈనెల 10, 11వతేదీల్లో నిర్వహించనున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

12, 13న మండల స్థాయి క్రీడాపోటీలు

యల్లనూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 12, 13వతేదీల్లో మండలంలోని జిల్లా ఉన్నత పాఠశాలల బాలికలకు ఎస్‌జిఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా చిలమకూరు ఆదర్శ పాఠశాల మైదానంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, హాకీ, చెస్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మారెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

కళ్యాణదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వెలిసిన మారెమ్మ దేవతకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, కన్వీనర్ జక్కుల మాధవ్, కమిటీ సభ్యులు డాక్టర్ ప్రసన్న భారతి, విజయేంద్ర, జమీల చరణ్, హర్షద్, ఎన్జీవో నాయకులు చెన్నారెడ్డి, నర్సారెడ్డి, రవిరాజ్, శేఖర్‌రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్

రాయదుర్గం : జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీన శనివారం రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రాజీపడే సివిల్, క్రిమినల్ కేసులు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, పెండింగ్‌లో లేని సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

మాతా, శిశు మరణాలను అరికట్టాలి

అనంతపురం : మాతా శిశు మరణాలను తగ్గించేందుకు వైద్యుల తోపాటు సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఎక్కడైనా మాతాశిశు మరణాలు సంభవిస్తే వెంటనే అక్కడికి వెళ్లి అందుకు కారణాలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డిఐఒ డాక్టర్ యుగంధర్, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి, మత్తు మందు నిపుణులు నాగేంద్ర, చిన్నపిల్లల వైద్య నిపుణులు శంకర్ నారాయణ, స్త్రీవైద్య నిపుణులు డాక్టర్ నిస్సార్‌బేగం, డాక్టర్ అరుణ, డాక్టర్ విజయకుమార్ అప్పా, ఎంపిహెచ్ఇఒ లక్ష్మన్న, ఎంపిహెచ్ఎస్ హేమలత పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు కుర్చీలు వితరణ

అనంతపురం : జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు అనంతపురం జిల్లా అధ్యక్షుడు, అర్బన్ ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ సూచన మేరకు మంగళవారం నాడు రుద్రంపేట పంచాయతీ జనసేన నాయకులు ఆకుల అశోక్, ఆకుల హరి ఆధ్వర్యంలో అంగవాడీ కేంద్రాలకు కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వీర మహిళ లు అంజలి, అరుణ తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితుల సహాయక చర్యల్లో జిల్లా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విజయవాడ బాధితులకు అండగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సైన్యం నిలుస్తోంది. తనను ఇన్‌ఛార్జిగా నియమించిన విజయవాడ 40వ డివిజన్‌లో ఇప్పటికే 60టన్నుల కూరగాయలు, నిత్యవసరాలను తీసుకెళ్లి స్వయంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బాధితులకు అందించారు. అంతేగాకుండా ఆయా కాలనీల్లో పర్యటించి పరిశుభ్రత కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు గంగారామ్, కృష్ణారెడ్డి, తొండపు నాటి రమేష్, రాయల్ మధు, జోగి రాజేంద్ర, బండి కాశీ విశ్వనాథ్, దలవాయి వెంకటనారాయణ, వన్నూరప్ప, వడ్డే వెంకటేష్, ధరూర్ ఓబుళనాయుడు, సంతోష్, జనసేన జిల్లా నాయకుడు జయరామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా 8రోజులుగా విజయవాడలో వరదలతో అల్లాడుతున్న బాధితులకు తనవంతు సాయంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ 10లక్షల రూపాయల సాయం అందించారు. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబును స్వయంగా కలిసి చెక్కు అందజేశారు.

విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. వరద బాధితుల సహాయార్థం వారంరోజులుగా విజయవాడలో ఉండి సేవలు అందించిన చౌదరి బృందం పండుగ సందర్భంగా అనంతపురం జిల్లాకు వచ్చి బాధితుల సహాయార్థం దుప్పట్లు సేకరించి మంగళవారం విజయవాడకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో స్వయంగా పర్యటించిన సందర్భంగా అక్కడ ప్రజల ఇబ్బందులను చూసి చలించిపోయామన్నారు. ఇందులో భాగంగా అనంతపురం నగరంలోని కొన్ని దుకాణాలలో మంచి నాణ్యతతో కూడిన రగ్గులను కొనుగోలు చేసి సొంత వాహనంలో విజయవాడ ముంపు ప్రాంతాలకు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గోపాల్‌గౌడ్, ఎస్సీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి చిర్రోళ్ల రామాంజనేయులు, యూనిట్ ఇన్‌ఛార్జి వడ్డే మురళి, బూత్ ఇన్‌ఛార్జి దేవళ్ల హరిబాబు, రవి చౌదరి, సున్నం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : గన్నవరం నియోజకవర్గంలోని అంబాపురం గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతంలో నిరాశ్రయులైన వరద బాధితులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సాయమందించారు. సొంత ట్రస్టు నారాయణస్వామి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నడుచుకుంటూ వెళ్లలేని కాలనీలకు జెసిబి సాయంతో వెళ్లి బాధితుల వద్దకు వెళ్లి సాయం అందించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాదాపు మోకాళ్ల లోతు నీటిలో వెళ్లి చిన్న పిల్లలతో మాట్లాడి మనో ధైర్యాన్ని నింపారు. తర్వాత గ్రామస్తులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.



ట్రాక్టర్ ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

విరాళాల సేకరణ

కళ్యాణదుర్గం : వరద బాధితుల కోసం ఎస్‌విఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల సేకరణ మంగళవారానికి 7వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఉన్న దుకాణాల్లో విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొలంకి శ్రీధర్, డాక్టర్ రవిశంకర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సాయి, నవీన్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే కంబదూరు టిడిపి నాయకులు సేకరించిన రూ.2లక్షల విరాళాన్ని మంగళవారం స్థానిక ప్రజా వేదిక వద్ద రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్మోహన్‌చౌదరి, రాష్ట్ర రైతు నిర్వాహక కార్యదర్శి లక్ష్మీనారాయణ చౌదరి, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండా వెంకటేశులు, శ్రీరాములు, శివన్న, సుబ్బరాయుడు, భాస్కర్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన 50 బస్తాల బియ్యం బస్తాలను మంగళవారం ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు బుట్నా తిమ్మరాజులు, గాజుల రాఘవేంద్ర, వెంకటరమణ, రాజు, రఘు, తదితరులు పాల్గొన్నారు.




అనంతపురంలో విరాళాలు సేకరిస్తున్న టిడిపి నాయకులు



బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి



మృతిచెందిన రవి

పామిడి : మండలంలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు రవి (24) మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. టంగుటూరి చిన్నప్ప శ్రేష్టి ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి వారు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినటుల తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కాగా విషయం తెలుసుకున్న టిడిపి మండల సమన్వయ బాధ్యులు ఆర్ఆర్.రమేష్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళి రవి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.